జూన్ 3న ఆర్టీసీ వద్ద మిగిలి ఉన్న పార్సిళ్ల వేలం

కాప్రా, మే 26: కుషాయిగూడ ఆర్టీసీ డిపో కార్గో కౌంటర్‌లో వినియోగదారులు నిర్ణీత సమయంలో తీసుకోకపోవడంతో అలాగే ఉండిపోయిన పార్సిళ్లను వేలం వేయనున్నట్టు ఆర్టీసీ అధికారులు ప్రకటించారు. జూన్ 3వ తేదీన ఉదయం 11 గంటలకు కుషాయిగూడ డిపో వద్ద ఎవరూ తీసుకోకుండా మిగిలిపోయిన పార్సిళ్లను వేలం వేస్తున్నట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వేలంలో పాల్గొనాలని ఆర్టీసీ కుషాయిగూడ డిపో మేనేజర్ కోరారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పక్కకు జరపాలి

పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, అధికారులు

నేరేడ్‌మెట్, మే 26: ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేసి పక్కకు జరపాలని స్థానిక బీఆర్ఎస్ నేత మేకల రాముయాదవ్ అధికారులను కోరారు. గౌతం నగర్ డివిజన్ పరిధిలోని యాదవ్‌నగర్ పాత పోస్టాఫీస్ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయాలని విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. స్పందించిన ఏఈ రవీందర్ సోమవారం సంఘటనా స్థలానికి చేరుకొని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. త్వరలో సమస్యను పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.

కుషాయిగూడ రిటైల్ మార్కెట్ వర్తక సంఘం నూతన అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి

శ్రీనివాస్‌రెడ్డి

చర్లపల్లి, మే 26: చర్లపల్లి డివిజన్ కుషాయిగూడ రిటైల్ మార్కెట్ వర్తక సంఘం నూతన అధ్యక్షుడిగా ఆకిటి శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికయ్యారు. సోమవారం కుషాయిగూడ రిటైల్ మార్కెట్ వర్తక సంఘం ఎన్నికల ఇన్‌చార్జి ఎంఎస్.చారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో ఆకిటి శ్రీనివాస్‌రెడ్డి తమ సమీప ప్రత్యర్థి పారేపల్లి చంద్రయ్యపై 20 ఓట్లతో గెలుపొందారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా గెలుపొందిన శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కుషాయిగూడ రిటైల్ కూరగాయల మార్కెట్‌లో నెలకొన్న సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. మార్కెట్‌లో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కుషాయిగూడ పోలీసులతోపాటు మార్కెట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో రేపు మెగా జాబ్ మేళా

ఘట్‌కేసర్, మే 26: నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకుగాను ఈనెల 28వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఐఐటీఎం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఐఐటీఎం డిగ్రీ కళాశాలలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 28న తమ కళాశాలలో నిర్మాన్ ఆర్గనైజేషన్ సహకారంతో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ జాబ్‌మేళాలో 5కి పైగా ప్రముఖ ఫార్మా, నాన్ ఐటీ, బ్యాంకింగ్, ఇతర పరిశ్రమలు పాల్గొననున్నట్లు చెప్పారు. ఈ జాబ్‌మేళాలో పాల్గొనేవారు 18నుంచి 28 ఏండ్ల వయసు కలిగిన యువతీయువకులు అర్హులని, హాజరయ్యే అభ్యర్థులు తమ బయోడేటాతోపాటు స్టడీ సర్టిఫికెట్లు ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ తదితర విద్యార్హత సర్టిఫికెట్లు కలిగి ఉండాలని తెలిపారు. ఈ జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీయువకులు వినియోగించుకొని ఉద్యోగ అవకాశాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు పద్మా రెడ్డి, బాబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్‌లోని ప్రభుత్వ ఐటీఐలో...

మేడ్చల్ కలెక్టరేట్ :జిల్లా ఉపాధి కల్పనా అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన అల్వాల్‌లోని ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఉపాధి కల్పన అధికారి రాధిక ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మేళా జరుగుతుందన్నారు. అపోలో ఫార్మాసీ ప్రతినిధులు 100 ఖాళీలను భర్తీ చేసుకునేందుకు ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నారని తెలిపారు. డీ ఫార్మసీ, బీ ఫార్మసీ, ఎం.ఫార్మసీ, ఎస్ఎస్సీ, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన వారు జాబ్‌మేళాలో పాల్గొనడానికి అర్హులన్నారు. ఈ అవకాశాన్ని అర్హత ఉన్న నిరుద్యోగులు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

ఆర్య వైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి

కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుజాత

అమావాస్య అన్న ప్రసాద విత్తనాలలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత

మల్కాజిగిరి, మే 26: ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత అన్నారు. సోమవారం అల్వాల్‌లోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమావాస్య అన్నప్రసాద వితరణలో చైర్‌పర్సన్ సుజాత పాల్గొన్నారు. కార్యక్రమంలో నాగభూషణం, మండల అధ్యక్షుడు రవీందర్, జనరల్ సెక్రెటరీ జగ్గయ్య, కోశాధికారి నరేందర్, ఎం రమాదేవి, ఎం.మాధవి, టీ.రాధిక తదితరులు పాల్గొన్నారు.

ప్రతి డివిజన్‌లో దశలవారీగా అభివృద్ధి పనులు



మల్లాపూర్ డివిజన్‌లో కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఎమ్మెల్యే, కార్పొరేటర్లకు సమస్యలపై వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మల్లాపూర్, మే 26 : అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సదరు కాంట్రాక్టర్ ఇంజినీరింగ్ అధికారులను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో భాగంగా ఆయన సోమవారం మల్లాపూర్ డివిజన్ పరిధిలో ఓల్డ్‌మల్లాపూర్, బీసీ ఏరియాలో రూ.51లక్షలతో సీసీ రోడ్డు, 12 లక్షలతో నాచారం, బాబానగర్ కాలనీలోని రజక శ్మశానవాటికలో బర్నింగ్ ప్లాట్ ఫార్మ్, స్నానపు గదుల అభివృద్ధి పనులకు కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉప్పల్ నియోజకవర్గంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలువకుండా ప్రతి డివిజన్‌లోని కాలనీల్లో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ డీఈ రూపా, ఏఈ శ్రవంతి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సాయి జెన్ శేఖర్, ఓల్డ్ మల్లాపూర్ వాసులు, నాచారం రజక సంఘం సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పర్యటించిన ఎమ్మెల్యే..

మల్లాపూర్, మే 26 : ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో దశలవారీగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం ఆయన అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డితో కలిసి బాబానగర్ దుర్గానగర్, హనుమాన్ నగర్ కాలనీలో పర్యటించారు. హిందూ, ముస్లిం శ్మశాన వాటిక, అంబేద్కర్ భవన్ నిర్మాణం కోసం కాలనీల్లో రోడ్ల సమస్యలపై కాలనీవాసులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పొన్నాల మహేందర్. జరిపోతుల భాస్కర్, భూపతి అశోక్, కందుల రాజు, దేవకుమార్, మూర్తి, ఎండీ నయీమ్, జబ్బార్, రాజు గౌడ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడి చేసి అధిక లాభాలు

కేశ్వపూర్‌లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

శామీర్‌పేట, మే 26: పంట మార్పిడితో అనేక లాభాలు ఉన్నాయని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు డాక్టర్ అనురాధ, డాక్టర్ లక్ష్మీప్రసన్న అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాలను ఆద్రాస్‌పల్లి, కేశ్వపూర్ గ్రామాల్లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అవసరం మేరకే రసాయన ఎరువులు ఉపయోగించాలని యూరియాను తక్కువుగా వాడి ఖర్చును తగ్గించుకోవాలన్నారు. పంట మార్పిడి కారణంగా రైతాంగానికి ఎన్నో లాభాలని భూసారంతోపాటు చీడపీడల బెడద తగ్గుతుందన్నారు. సాగునీటిని ఆదా చేయాలని, అధికారుల సలహాలు, సూచనల మేరకు సాగు పద్ధతులను పాటించి అధిక దిగుబడులు, లాభాలను గడించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో లక్ష్మణ్‌గౌడ్, కే.రోహిత, రైతు సమితి అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాధవి, లత, బీవోఏలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

లలితాయాదవ్ చరిత్రను పాఠ్యపుస్తకాల్లో పొందుపర్చాలి

మాజీ కార్పొరేటర్ మేక లలితాయాదవ్

జవహర్‌నగర్, మే 26: తెలంగాణ మలిదశఉద్యమంలో తన గొంతుతో ఊరూరా తిరిగి ప్రత్యేక తెలంగాణ ఆవశ్యకతను ప్రజలకు వివరించి ఏకం చేసిన బెల్లి లలితాయాదవ్ చరిత్రను పాఠ్యపుస్తకాల్లో పొందుపర్చాలని మాజీ కార్పొరేటర్ మేక లలితాయాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జవహర్‌నగర్ మాజీ కార్పొరేటర్ మేక లలితాయాదవ్ ఆధ్వర్యంలో మలిదశఉద్యమకారిణి బెల్లి లలితాయాదవ్ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం భువనగిరిలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లలితాయాదవ్ మాట్లాడుతూ ఆమె పాటలే తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోశాయని, సమైక్య పాలకులు జీర్ణించుకోలేక తెలంగాణ గాన కోయిల బెల్లి లలితాను పొట్టనపెట్టుకున్నారని గుర్తు చేశారు. ఆమె విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొనపూరి కవిత, రాజారాంయాదవ్, సురేష్‌యాదవ్, వెన్నెల, సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్థూపం వద్ద బెల్లి లలితాయాదవ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన మాజీ కార్పొరేటర్ మేక లలితాయాదవ్

కొత్త మున్సిపాలిటీల్లో

వార్డుల విభజనకు అధికారుల కసరత్తు

మేడ్చల్, మే 26: మేడ్చల్ నియోజకవర్గంలో కొత్తగా ఏర్పాటవుతున్న మున్సిపాలిటీల్లో వార్డుల విభజనకు కసరత్తు జరుగుతున్నది. గత నెల15వ తేదీన కొత్త మున్సిపాలిటీల ఏర్పాటుకు గెజిట్ విడుదల విషయం తెలిసిందే. నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో ఏడు మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్‌లు ఉన్నాయి. అయితే నియోజకవర్గం నగరానికి అనుకోని ఉండటంతో పట్టణీకరణకు పూనుకున్నది. మొదట ఘట్‌కేసర్, కీసర మండలాల్లో ఉన్న మొత్తం గ్రామాలను ఘట్‌కేసర్, పోచారం, నాగారం, పోచారం మున్సిపాలిటీల్లో విలీనం చేశారు. మేడ్చల్ మండలంలోని పూడూరు, రాయిలాపూర్, మునీరాబాద్, గౌడవెల్లి గ్రామాలను మేడ్చల్, గుండ్లపోచంపల్లి, శామీర్‌పేట మండలంలోని శామీర్‌పేట, బొమ్మరాశిపేట, బాబాగూడ గ్రామాలను తూంకుంట విలీనం చేశారు. కాగా, మేడ్చల్, శామీర్‌పేట మండలాల్లోని మిగిలిన గ్రామ పంచాయతీలను సైతం పట్టణీకరణలో భాగంగా మున్సిపాలిటీలు మార్చుతూ నిర్ణయం తీసుకున్నారు.

మేడ్చల్ మండలంలోని మిగిలిన 14 గ్రామాలను (ఎల్లంపేట, డబిల్‌పూర్, మైసిరెడ్డిపల్లి, కోనాయిపల్లి, నూతన్‌కల్, శ్రీరంగవరం, బండమాదారం, లింగాపూర్, రావల్‌కోల్, సైదోనిగడ్డ తండా, రాజబొల్లారం, రాజబొల్లారం తండా, ఘన్‌పూర్, సోమారం) ఎల్లంపేట కేంద్రంగా మున్సిపాలిటీగా మార్చారు. శామీర్‌పేట మండలంలోని మిగిలిన 6(ఆలియాబాద్, లాల్‌గడీమలక్‌పేట, మజీద్‌పూర్, మురహరిపల్లి, తుర్కపల్లి, యాడారం గ్రామ పంచాయతీలను) ఆలియాబాద్ కేంద్రంగా మున్సిపాలిటీగా మార్చారు. మూడుచింతపల్లి మండలంలోని 12(మూడుచింతపల్లి, అద్రాస్‌పల్లి, అనంతారం, జగ్గంగూడ, కేశవపూర్, కేశవరం, కొల్లూర్, లక్ష్మాపూర్, లింగాపూర్ తండా, నాగిశెట్టిపల్లి, నారాయణపూర్, పోతారం) పంచాయతీలను మూడుచింతపల్లి కేంద్రంగా మున్సిపాలిటీ మార్చారు.

వార్డుల విభజనపై ఆలియాబాద్‌కు విచ్చేసిన అధికారులు

ఓటర్ల ప్రాతిపదికన...

కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీల్లో ఓటర్ల ప్రాతిపదికన వార్డులను కేటాయించారు. మేడ్చల్, మూడుచింతపల్లి మున్సిపాలిటీల్లో 24 వార్డులు, ఆలియాబాద్‌లో 20వార్డులను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఓటర్లు, కేటాయించిన వార్డులకు అనుగుణంగా విలీన గ్రామాలకు వార్డులను కేటాయించేందుకు అధికారులు ప్రభుత్వ ఆదేశాల మేరకు కరసత్తు చేస్తున్నారు. వార్డుల విభజనకు సంబంధించిన అధికారులను నియమించారు. ఎల్లంపేటకు సీడీఎంఏ జేడీఎం నారాయణరావు, ఆలియాబాద్ జేడీఎం శ్రీనివాస్, మూడుచింతపల్లికి నాగారం మున్సిపాలిటీ చైర్మన్ భాస్కర్ రెడ్డిని కేటాయించారు. అధికారులు వార్డు విభజనపై ఇప్పటికే కసరత్తు ప్రారంభించారు. ఆయా మున్సిపాలిటీ కేంద్రాలను సందర్శించారు. వార్డులుగా మార్చుతున్న గ్రామాల్లోని సరిహద్దులను కసరత్తు ప్రారంభించారు. ఆయా మున్సిపాలిటీలో ఉన్న గ్రామాలు, ఓటర్లు ఆధారంగా వార్డుల విభజన చేశారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే వార్డుల విభజన జాబితాలను ప్రకటించేందుకు సిద్ధం అవుతున్నారు. 20వార్డులతో ఏర్పాటు చేసిన ఆలియాబాద్‌లో ఆలియాబాద్ ఏడు, మలక్‌పేటకు 5, తుర్కపల్లికి 4, మురహరిపల్లికి 1, యాడారం 1, మజీద్‌పూర్ 2వార్డులను కేటాయించినట్టు తెలుస్తున్నది. ఎల్లంపేట మున్సిపాలిటీలోని డబిల్‌పూర్, రావల్‌కోల్ గ్రామాల్లో ఎక్కువ మంది ఓటర్లు ఉన్న కారణంగా అత్యధికంగా వార్డులను కేటాయించే అవకాశం ఉన్నది. మూడుచింతలపల్లి, ఆలియాబాద్ మున్సిపాలిటీల్లో సోమవారం పర్యటించి, వార్డు విభజన చేశారు. ఎల్లంపేటను ఐదు రోజుల కిందట జేడీఎం నారాయణరావు సందర్శించి, వార్డు విభజనను పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

ఘట్ కేసర్, మే 26: ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ సుగుణ బాయి తెలిపారు. ఘట్‌కేసర్ మండల పరిధి మాదారం, ఏదులాబాద్ గ్రామాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆమె సందర్శించి పరిశీలించారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం చేయకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలోని ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ధాన్యం కేంద్రాల్లో రైతులకు సకాలంలో డబ్బులు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆమె తెలిపారు. రైతులకు ఇబ్బందులు కలిగించేలా అధికారులు వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేస్తామని ఆమె రైతులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆమె అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పౌర సరఫరా శాఖ అధికారులు, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న జిల్లా పౌరసరఫరాలశాఖ మేనేజర్ సుగుణ బాయి

హైదరాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు

కానూరి వంశీధర్(బీఏ హెచ్ జనరల్ సెక్రటరీ)

నేరేడ్‌మెట్, మే 26 : హైదరాబాద్ జిల్లా ఛాంపియన్‌షిప్ పోటీలు జూన్ 5నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ కానూరి వంశీధర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు సబ్ జూనియర్, జూనియర్, మెన్, ఉమెన్, మాస్టర్ విభాగాలుగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీలు బండ్లగూడ జాగీర్‌లోని గేమ్‌పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీలు హైదరాబాద్ జిల్లాకు సంబంధించిన బ్యాడ్మింటన్ క్రీడాకారులకు మాత్రమేనని సూచించారు. ఇతర జిల్లా క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనడానికి అనర్హులన్నారు. అయితే క్రీడాకారులు ఏదైనా ఒక జిల్లాలోనే పాల్గొనాలని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు జూన్ 2వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం బ్యాట్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. ఈ పోటీలు గేమ్‌పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

భగవద్గీతపై ప్రచారం నిర్వహిస్తున్న త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక సభ్యులు

భగవద్గీతపై ప్రచారం

మేడ్చల్, మే 26 : మేడ్చల్ పట్టణంలోని కేఎల్ఆర్, విజయనగర్ కాలనీలలో సోమవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక-హైదరాబాద్ కమిటీ అధ్యక్షుడు గిరి మాట్లాడుతూ.. దైవ జ్ఞానం ప్రకారం కులాలు అహేతుకం అని, మతాలు నిషిద్ధం అని ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ కర్మయోగం విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానం తెలుసుకోవాలి అనే ముఖ్యఉద్దేశంతో భగవద్గీత ప్రచారం చేస్తున్నామన్నారు. భగవద్గీతలో చెప్పిన ప్రకారం.. కర్మయోగం, బ్రహ్మయోగం, భక్తియోగం అనేవి దైవ ధర్మాలు అని వాటి ప్రకారం నడుచుకుంటే కర్మ నుంచి బయటపడేసి మనిషికి ముక్తిని ఇస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఎన్ఎస్.కుమార్, మధు, నరసింహచారి, చంద్రకళ, నాగమణి, పద్మ, స్వప్న, లక్ష్మి, పవన్, సుధీర్, షణ్ముఖ, జస్విత్‌కుమార్, మధు, కుసుమ, శివప్రసాద్, వయసు, దినేశ్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

మేడ్చల్, మే 26 : మేడ్చల్ మున్సిపాలిటీ అత్వెల్లికి చెందిన గోగికర్ లక్ష్మణ్‌కు సీఎం సహాయనిధి నుంచి రూ.85,500 మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన చెక్కును సోమవారం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి బోయినిపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు భాస్కర్, బీసీ సెల్ అధ్యక్షుడు మండల రవికుమార్, రెండో వార్డు అధ్యక్షుడు మండలి ఈశ్వరయ్య, నాయకులు చంద్రశేఖర్, దేవరాజుగౌడ్ పాల్గొన్నారు.

శామీర్‌పేటలో...

శామీర్‌పేట, మే 26 : ప్రజలు, నిరుపేదలు ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. మూడుచింతలపల్లి మండలం ఆద్రాస్‌పల్లి గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళ వైద్య చికిత్స నిమిత్తం ఆర్థిక సాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నది. మంజూరైన రూ.55,500 విలువగల చెక్కును ఎమ్మెల్యే చేతులమీదుగా సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షుడు భాస్కర్‌యాదవ్, సంజీవ్‌యాదవ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి

కార్యక్రమంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టరేట్ విజయేందర్ రెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్, మే 26:బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కొత్తగా నియామకమైన సర్వేయర్లకు అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కొత్తగా నియమితులైన 146మంది లైసెన్స్‌డ్ సర్వేయర్ల సర్టిఫికెట్ల పరిశీలన, శిక్షణ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేయర్ల శిక్షణ కార్యక్రమం మంగళవారం నుంచి ప్రారంభం అవుతుందన్నారు. ప్రతిఒక్కరూ శిక్షణకు విధిగా హాజరుకావాలన్నారు. 52 రోజుల పాటు శిక్షణా కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ పొందిన తరువాత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో శామీర్‌పేట్ తహశీల్దార్ యాదగిరిరెడ్డి, సర్వేల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, అధికారులు బలరాం, సత్తమ్మ, శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్, తహశీల్దార్, ఏవోలతో కలిసి శామీర్‌పేట మండలం ఆలియాబాద్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ప్రజావాణికి 76 దరఖాస్తులు

త్వరితగతిన పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ ఆదేశం

ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్, మే 26: ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 76 ఫిర్యాదులు వచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు సమర్పించిన అర్జీలను డీఆర్‌వో హరిప్రియతో కలిసి అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం ప్రజావాణిని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల అర్జీలపై సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోచారం మున్సిపాలిటీలో తైబజార్ వేలం పాటలు

రూ.24లక్షల77వేలకు దక్కించుకున్న కక్కెర్ల శ్రీనివాస్



పోచారం మున్సిపాలిటీ కార్యాలయంలో తైబజార్ వేలం పాటలను నిర్వహిస్తున్న కమిషనర్ వీరారెడ్డి

పోచారం, మే 26 : పోచారం మున్సిపాలిటీలో తైబజార్ వేలం పాటలను సోమవారం నిర్వహించారు. మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ వీరారెడ్డి ఆధ్వర్యంలో అధికారులు ఈ వేలం పాటలను నిర్వహించారు. పాత మున్సిపాలిటీ ప్రాంతాలను, ఇటీవల మున్సిపాలిటీలో విలీనం అయిన ఐదు గ్రామాల్లో వేర్వేరుగా అధికారులు వేలం పాటలను జరిపారు. ఈ వేలం పాటలకు మొత్తం 9 మంది దరఖాస్తు చేసుకొని వేలం పాటలలో పాల్గొన్నారు. ఇందులో కక్కెర్ల శ్రీనివాస్ వేలం పాటలను దక్కించుకున్నారు. పాత మున్సిపాలిటీ ప్రాంతాలను రూ.16లక్షల77వేలకు, విలీన గ్రామాల్లోని తైబజార్‌ను రూ.8లక్షలకు పాటలో కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ మేనేజర్లు టి.అశోక్, నిర్మల, ఆర్ఓ కిరణ్ కుమార్, ఆర్ఐ సాయిరాజ్, అధికారులు, సిబ్బంది, పోటీదారులు పాల్గొన్నారు.

కొబ్బరి పీచు ఫ్యాక్టరీ దగ్ధం

రూ. 23లక్షల ఆస్తి నష్టం